అమ్మవారి ఉత్సవాలకు రూ.83 లక్షల నిధులు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పాతపట్నం : నియోజకవర్గ కేంద్రంలో కొలువైయున్న ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం కోరిన కోర్కెలు తీర్చే పాతపట్నం శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలను ఈనెల 21వ తేదీ నుండి 30 వరకు నిర్వహించనున్న గ్రామ దేవత పెద్ద పండగలను అంగ రంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఆంధ్ర, తెలంగాణ, ఒడిసా, వెస్ట్ బెంగాల్, రాష్ట్రాల నుండి సుమారు 15, 20 లక్షలకు పైగా ప్రజలు హాజరు కానున్న అమ్మవారి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలలో భాగంగా స్థానిక శాసన సభ్యురాలు రెడ్డి శాంతి విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు మరియు ప్రభుత్వ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను గూర్చి ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ప్రెస్ మీట్ నిర్వహించి పలు విషయాలను మీడియాకు వివరించారు. పాతపట్నం మేజర్ పంచాయతీలో విద్యుదీకరణ పనులకు గాను ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారి ద్వారా 53 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయబడినవని తెలియజేశారు. అమ్మవారి ఉత్సవాలు నిర్వహణ సమయంలో పాతపట్నంలో ఎటువంటి రాక పోకలకు అంతరాయం తలెత్తకుండా బూరగాం గ్రామం నుండి పర్లాఖిమిడి ప్రయాణించేందుకు వీలుగా ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణమునకు పంచాయితీ రాజ్ డిపార్ట్మెంట్ ద్వారా 13 లక్షలు రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలియజేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్వహిస్తున్న పనులలో భాగంగా పాతపట్నం పంచాయతీలో రక్షిత మంచినీటి సరఫరా కొరకు 12 లక్షల రూపాయలతో 1 లక్ష లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల సంప్ నిర్మాణం చేపట్టారని తెలియజేశారు. పాతపట్నం గ్రామం ఉత్సవాల నిర్వహణ సమయంలో మౌలిక సదుపాయాల కల్పనకు 2 లక్షల రూపాయలు జిల్లాపరిషత్ నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యేరెడ్డి శాంతి అన్నారు. వీటితో పాటుగా పాతపట్నంలో నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీ శ్రీకేష్ లఠ్కర్ వారి ద్వారా 5 లక్షల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందాని తెలియజేశారు.అదే విధంగా పాతపట్నంలో అమ్మవారి ఉత్సవాల నిర్వహణ సమయంలో ప్రజలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేదిశగా 15 బయో టాయిలెట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా అమ్మ వారి ప్రధాన ఉత్సవ కమిటీ అధ్యక్షులు లింగాల రవి బాబు మాట్లాడుతు మన ఎమ్మెల్యే రెడ్డి శాంతి దగ్గరుండి ముఖ్యమంత్రికి మన అమ్మవారి పండగ విశేషాన్ని తెలియచేసి ప్రభుత్వము ద్వారా నిధులు మంజూరు చేయించ లికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి కి

ధన్యవాదములు తెలియచేశారు. అమ్మ వారి పండగలను అత్యంత వైభవోపేతంగ నిర్వహించడానికి కృషి చేస్తున్నా అన్ని విభాగాలకు సంబంధించిన ఉద్యోగస్తులను ఆమె అభినందించారు అలాగే ఈ సమయస్ఫూర్తి తో అమ్మవారు పండుగల వరకు ఉండాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డిఈఈ జి. హెచ్ఎస్వీ ప్రసాద్, ఏఈఇ రమేష్, ఎంపీడీవో జయంతి ప్రసాద్, ఈవోపీఆర్డి నర్సింగ్ ప్రసాద్ పండ ఆర్డబ్ల్యుఎస్ ఏఈ కళ్యాణ్ రామ్, నీలమణి దుర్గ ఈవో వాసుదేవరావ్, మేజర్ పంచాయతీ ఈవో కూర్మారావ్ మరియు నీలమణి దుర్గ హెడ్ కమిటీ సభ్యులు శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ కమిటీ ఛైర్మన్ నూలు ఈశ్వరరావు మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి సిర్ల జోగారావు, పాతపట్నం మండల వైస్ ఎంపిపి సవిరిగాన శ్రీనివాసరావు, బొరుభద్ర సర్పంచ్ ప్రతినిధి ఏస్ శ్రీనివాసరావు, పనుకు మోహన్, ఎనుగుతల సూర్యం, శాసనపురి మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కతో దర్శనమిస్తున్న 'వంశధార' కాలువలు

రూ.40లక్షలతో ప్రతిపాదనలు తయారుచేసిన అధికారులు

విశాలాంధ్ర-నరసన్నపేట: సబ్ డివిజన్ పరిధిలో వంశధార కాలువలు గుర్రపు డెక్కతో దర్శనమిస్తున్నాయి. ప్రతీ ఏటా ఖరీఫ్ సీజన్ ముందు వంశధార అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి, సాగునీటి కాలువల్లో, చెరువుల్లో గుర్రపు డెక్కను తీయించినా, ప్రతీ సంవత్సరం కాలువల్లో అత్యధికంగా పేరుకుపోయి, రైతాంగానికి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. దీనితో పంటలకు సాగునీరు కావాల్సినంత అందటంలేదనేది వ్యవసాయదారులు వాదన. గత సంవత్సరం జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సిఎం, ధర్మాన కృష్ణదాస్ చొరవతో జిల్లా కలెక్టర్, లాఠ్కర్ శ్రీకేష్ బాలాజీరావు కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రానికి సంబందించిన నిధులు రూ.40లక్షలు మంజూరు చేసి, కాలువల్లో, చెరువుల్లో గుర్రపు డెక్కను తీయించారు. దీనివలన పంటలకు సాగునీరు సక్రమంగా అంది, దిగుబడులు అత్యధికంగా వచ్చాయి. మరలా నేడు సాగునీటి కాలువల్లో అధిక సంఖ్యలో గుర్రపు డెక్క పేరుకుపోయింది. ఈ విషయమై ఆదివారం వంశధార ఏఈ, సురేష్‌కుమార్ విశాలాంధ్రతో మాట్లాడుతూ నరసన్నపేట సబ్ డివిజన్ పరిధిలో 8ఆర్-దేవాది, 19-ఈ, నడగాం కాలువ, 7ఆర్-ఉర్లాం కాలువ, పోలాకిలోని 15-టిఈ, 16-టిఈ, 11ఆర్-కిళ్ళాం, దేశవానిపేట కాలువల్లో వున్న గుర్రపు డెక్కను తొలగించేందుకు సుమారు రూ.40లక్షలతో ప్రతిపాదనలు తయారుచేసి, జిల్లా కలెక్టర్‌కు పంపించామని తెలిపారు. నిధులు మంజూరు అయిన వెంటనే ఈ ఖరీఫ్ సీజన్‌లో పనులు ప్రారంభించి, గుర్రపు డెక్క పూర్తిస్థాయిలో తొలగిస్తామని తెలిపారు. ప్రతీ ఏడాది లక్షల రూపాయలు వ్యయం చేసి, గుర్రపు డెక్క తొలగిస్తున్న వంశధార అధికారులు, శాశ్వతంగా డెక్కను తొలగించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మాతృమూర్తి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కుసుంపురం గ్రామంలో నిర్వహిస్తున్న హరే రామ హరే కృష్ణ మహామంత్ర యజ్ఞంలో భాగంగా స్థానిక మాతృమూర్తి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆదివారం సుమారు 5 వేలు మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాతృమూర్తి యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమ జయంతి

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని జగతి,బెజ్జి పుట్టుగ, బొరివంక, కవిటి, కే. కొత్తూరు, కొర్రాయిపుట్టుగ తదితర గ్రామలలో హనుమాన్ జయంతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కవిటి ఆటోస్టాండ్ ఆవరణంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద, కే కొత్తూరు,జగతి మూడు రోడ్ల కూడలిలో ఉన్న హనుమాన్ ఆలయాలు వద్ద, పులకల వీధి హనుమాన్ ఆలయం వద్ద వేకువజాము నుండి భక్తులు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అఖండ నామ సంకీర్తన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.కొర్రాయి పుట్టుగ గ్రామంలో హనుమాన్ ఆలయ ప్రతిష్ట మహోత్సవం, అన్నసంతర్పన, కుంకమపూజ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హరిపురంలో బాలికల జూనియర్ కళాశాల

విశాలాంధ్ర-మందస : మందస మండల హరిపురం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేసిందని ఎంఇవో ఎం.లక్ష్మణరావు తెలిపారు. హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులో కలాశాలను తాత్కాలికంగా నడపడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని ఆయన తెలిపారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో బాలికల చేరేందుకు ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం అవకాశం కల్పించిందని, బాలికల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ విద్యకు ప్రోత్సహించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం గోడ పత్రికను ఆవిష్కరించారు. కళాశాలలో అధ్యాపకులను, సిబ్బందిని ప్రభుత్వం నియమించిందని ఆయన తెలిపారు.

వైభవోపేతంగా పాలపోలమ్మ తల్లి ఉత్సవాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం బోరుభద్ర గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పాలపోలమ్మ తల్లి గ్రామదేవత సంబర మహోత్సవాలు అంగరంగ వైభవంగా, అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి.ఈ మహోత్సవాలు సందర్భంగా పాలపోలమ్మ తల్లి ఆలయం వద్దకు భక్తులు వెళ్లి పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకుంటూ అమ్మవారి మూలవిరాట్ విగ్రహానికి వేలాది మంది మహిళలు ముర్రాటలు సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కల్పించే పగటి వేషాలతో పాటు, పలు రకాల కళాకారుల నృత్యాలు ప్రదర్శనలు చూపరులకు ఆకట్టుకుంటున్నాయి. అలాగే ఆదివారం యావన్మంది గ్రామస్తులు పాలపోలమ్మ తల్లికి చీరలు, కొత్త వస్త్రాలు సమర్పించు కొని తమ మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ముందుగా గ్రామంలో ఉన్న నీలమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు సమర్పించుకున్నారు. పాలపోలమ్మ తల్లి, నీలమ్మ తల్లి ఆలయాల వద్ద ఆలయాల పూజారులు ఫిర్యాదు పిరియా భాగెన్నాయుడు, ఫిర్యా సాంబమూర్తి, ప్రియా రామచంద్ర రావు, పిరియా పూర్ణచంద్రరావులు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చి దీవి దీవిస్తున్నారు.

పలాసలో జీడి బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస కేంద్రంగా కేరళ మాదిరిగా పలాసలో జీడి బోర్డు ఏర్పాటు చేసి జీడి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకులు బి.ఓంకార్, కౌలు రైతు సంఘం నాయకలు బమ్మిడి ఆనంద్ కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ అనేక ఆటుపోట్లు, చీడలను ఎదుర్కొని వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను దగా చేస్తుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం సరైన చర్య కాదని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే కలుగు చేసుకొని రైతు భరోసా కేంద్రాలు ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలని, అలాగే పలాస కేంద్రంగా జీడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, లేకపోతే రైతులు పోరాటం చేయక తప్పదని వారు హెచ్చరించారు.

రణస్థలం శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణ

విశాలాంధ్ర-రణస్థలం: శాఖ గ్రంథాలయం లో ఉచిత వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ఏడవ రోజు దినపత్రికలు చదవడం, కథలు చదివించడం రాయించారు.. ఆదివారం ఆంగ్ల ఉపాధ్యాయులు కె భాస్కర్ రావు స్పోకెన్ ఇంగ్లిష్ బోధించారు. అలాగే విశ్రాంతి ఉద్యోగి ఆర్ ధర్మారావు నీతి కథలు సింహం, ఎలుక, బువ్వమ్మ కథ, నక్క సింహం) మాతృ దినోత్సవ ఎలా మొదలైందన్న విషయం గురించి వివరించారు. తదనంతరం విద్యార్థిని విద్యార్థులు క్యారమ్స్, చెస్ ఆటల్లో పాల్గొన్నారు.

సతీష్ వివాహానికి హాజరైన కృష్ణదాస్

విశాలాంధ్ర-సోంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాకన్వీనర్, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాసు సోంపేటలో పార్టీ సీనియర్ కార్యకర్త వై.సతీష్ వివాహ కార్యక్రమానికి ఆదివారం సోంపేట హాజరయ్యారు. సతీష్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, కంచిలి జెడ్పీటిసి ఇప్పిలి లోలాక్షి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ ఉలాల కోదండరాం కూడా వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కాశీబుగ్గ ఎస్ఐకు గాయాలు

విశాలాంధ్ర-పలాస : నందిగాం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్న సంఘటనలో కాశీబుగ్గ ఎస్.ఐ కుంచి గోపాలకృష్ణకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న 1033 నేషనల్ హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆపదలో అండగా ఉంటా : డాక్టర్ కోదండరాం

విశాలాంధ్ర-సోంపేట : ఆపద వచ్చినప్పుడు తాను అండగా ఉండి తనకు చేతనైన సహాయం అందిస్తానని సోంపేట మండలం పాత్రఖండ పంచాయతీ జగతికేశుపురం కోతుల దాడిలో గాయపడ్డ సరస్వతితో పేర్కొన్నారు. ఆరు పదుల వయస్సు దాటిన సరస్వతి ప్రస్తుతం పంచాయతీ వార్డు మెంబర్. మూడు రోజుల క్రితం ఒక కోతి భయంకరంగా దాడి చేసి కరవడంతో ఆమె తలకు ఐదు కుట్లు పడ్డాయి. విషయం తెలుసుకున్న డాక్టర్ కోదండరాం అనుచరులతో కలిసి ఆదివారం ఉదయం ఆమెను పరామర్శించారు. ఆమెకు జరిగిన నష్టం గూర్చి పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఫోన్ చేసి చెప్పడం జరిగిందని ఎవరూ ఇంతవరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. డాక్టర్ కోదండరాం అక్కడ నుంచే అటవీశాఖ అధికారికి,పంచాయతీ కార్యదర్శికి, ఇతర అధికారులకు ఫోన్ ద్వారా సమస్యను వివరించారు. కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు. వైద్యపరంగా ఏ సహాయం కావాలన్నా తననుసంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కీళ్ల రామారావు, ఎల్.గోవిందరాజులు, ఎం.శేఖర్, లింగరాజు,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందు చదువులకు అండగా ఉంటాం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం తీర గ్రామానికి చెందిన ఇందు ఇటీవల పదవ తరగతిలో జిల్లాస్థాయిలో ఉన్నతమైన ప్రతిభ కనబర్చింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆమె ఉన్నత చదువుల్లో మరింతగా రాణించాలని అందుకు సోంపేటకు చెందిన వేదం ఫౌండేషన్ అండగా ఉంటామని పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఇందు స్వగ్రామానికి ఫౌండేషన్ ప్రతినిధులు డి.జోగారావు, చంద్రశేఖర్, ఢిల్లేశ్వరరావు, సూరాడ చంద్రమోహన్, కృష్ణమూర్తి తదితరులు వంకలూరు వెళ్లి ఇందుకు ఆమె తల్లిదండ్రులు ధనరాజు, భానుమతితో కలిపి సన్మానం చేసి షీల్డు అందించి పది వేల రూపాయల నగదు కూడా అందజేశారు.

నన్ను గాలికొదిలేశారు... ఈ పాపం ఎవరిది

- ప్రమాదాలు చూసి నా కంట రక్తం కారుతుంది
- అమదాలవలస రోడ్డు ఆత్మఘోష

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నేను పుట్టెరిగి ఇప్పటి వరకూ నాదుస్థితి ఇలా తయారు కాలేదు. ఇరుకుగా ఉన్నానని వెడల్పు చేస్తామని చెప్పి నన్ను తవ్వి ఎక్కడి పనులు అక్కడే వదిలేయడంతో నాదుస్థితి మరింత దారుణంగా తయారైంది. కొండ నాలుకకు మందువేస్తే ఉన్న నాలుక ఊడిందనే సామెతకు అద్దపడుతుంది. ఎందరో ప్రయాణికులకు సుఖమైన ప్రయాణం కల్పిస్తాననుకున్నానే తప్ప ప్రమాదాలకు నిలయంగా మరుతానని కలలో కూడా అనుకోలేదంటూ అమదాలవలస నుంచి శ్రీకాకుళం రోడ్డు ఘోసిస్తుంది. నా గుండా ఎందరో పెద్ద పెద్ద నాయకులు, అదికారులు ఏసీ కార్లలో దార్జాగా వెలుతున్నారే తప్ప.. నా పరిస్థితి ని చూసి చలించటంలేదని నాకు అర్థం అయింది. నా గుండా సైకిల్ మీద వెళ్లిన నాయకులే ఇప్పుడు బుగ్గ కార్లలో దర్జాగా వెళుతున్నారు. వారిని చూసి ఎన్నో సార్లు ఆనందించాను. నాలో నేనే మురిచిపోయాను. నా గుండా ఇప్పుడు వెలుతున్నా కూడా ఇప్పుడు నా దుస్థితిని చూసి వారిలో కనీస చలనం లేదని తెలిసి నాలో నేను రగిలిపోతున్నాను. నా గుండా ప్రశాంత ప్రయాణం చేసి పెద్ద పెద్ద పదవులు అనుభవించిన వాళ్లు తులుచుకుంటే నా పరిస్థితి ఇలా ఉండేదా అని నాలో నేనే ప్రశ్నించుకుంటున్నాను. ఆమదాలవలస రైల్వే స్టేషన్ కి శ్రీకాకుళం నుంచి నిత్యం రాకపోకలు సాగి రద్దీ గా ఉండే నేను ఈ దారిన పోయే వారు. వారు పడుతున్న కష్టాలకు నన్ను తిట్టుంకుంటున్నారు. దీనికి కారణం నేనే లేదా రాజకీయ లబ్ధే ప్రదానంగా తీసుకుని నన్ను ఈ దుస్థితికి తీసుకు వచ్చిన పాలకులదా మీరే చెప్పాలి. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని తరలించే అంబులెన్స్‌లు కూడా త్వరగా వెళ్లలేని పరిస్థితికి కారణం ఎవరు. మొన్న ఒక బిడ్డ చనిపోతూ నలుగురికి ప్రాణదానం చేసినప్పుడు ఆ అవయవాలు దానం చేస్తే వాటిని తరలించిన బళ్లు కూడా నా గుండానే వెళ్లాయి. అది తక్కువ దూరం కనుక సరిపోయింది. అదే నా దారి పోడవునా వెళ్లాల్సి వస్తే ఆ అవయవాల తరలింపు ఎంత కష్టం ఆయ్యోదో అర్థం చేసుకోండి. ఇతర రాష్ట్రాలకు, జిల్లాకు వెళ్లాలన్నా నాగుండా ఎందరో ప్రయాణించేవారు ఇప్పుడు నా పరిస్థితిని చూసి ఇటు రాదానికి కూడా భయపడుతున్నారు. గర్బిణీ స్త్రీలు, వృద్ధులు ఇప్పుడు నాగుండా ప్రయాణంచాలంటేనే హడలిపోతున్నారు. ఎన్నో ప్రమాదాలు జరిగినా మార్గం రక్తసిక్తం అవుతుంది.ఈ పాపం ఎవరిది నాదా...పాలకులదా, సొమ్మున్న వారు ఎసీ కార్లలో మెల్లగా అయినా నా గుండా సుఖంగా ప్రయాణం చేసి వెళుతున్నారు. ఆ చుట్టు తిరిగి వెళ్లినవారికి వచ్చిన నష్టం ఏమీ లేదు. సామాన్యులే గతి లేక వెళ్లక తప్పక ఇటు వైపు గా ప్రయాణం చేసి వారు కష్టాలు పడుతుంటే నా మనసు కలసివేస్తుంది. సుఖప్రయాణం కల్పించాల్సిన నేను వారి వెన్ను నొప్పులకు కారణం అవుతున్నానంటూ నాలో నేనే కుమిలిన క్షణం లేదు. ముఖ్య మంత్రి జిల్లా పర్యటనలో ఆమదాలవలస రోడ్డు విస్తరణకు మరిన్ని నిదుల కేటాయిస్తున్నానని అన్నప్పుడు ఆ మీటింగ్ కి హజరైన జనం నా గుండా వెళుతూ ఆ

విషయం చర్చించుకున్నప్పుడు నా చెవిలో పడి ఎంతో ఆనందించాను. ఎల్ఈడీ వెళుతురులతో నా ఇరువైపులా పచ్చని చెట్లతో ప్రయాణికులకు ఆహ్లాదాన్ని అందిస్తానని ఎంతో ఆనంద పడ్డా. ఇప్పుడు యేళ్లు గడుస్తున్నా నా దుస్థితి మరింత దిగజారిందే తప్ప బాగుపడలేదు. నా గుండా ప్రయాణించే వారికి, నాకు నీడనిచ్చే చెట్లను కూడా తొలగించి కనీసం నీడ కూడా లేని పరిస్థితి తీసుకువచ్చిన పాపం ఎవరిది. నేను రాజకీయ విమర్శలకు పావుగా ఉపయోగ పడుతున్నానే తప్ప ప్రయాణీలకులను సుఖమైన ప్రయాణం కల్పించలేకున్నాను. నా గుండా ప్రయాణీకులు వెళ్తూ కాంట్రక్టర్ కి పాలకులకు వాటాల విషయంలో సయోధ్య కుదరక ఈ రోడ్డు పరిస్థితి ఇలా తయారయిందని చర్చించుకుంటున్నారు. అందులో నిజం ఎంత ఉందో తెలియదు కానీ నా దుస్థితితో ప్రజలకు వెన్ను నోప్పులు తెచ్చి నా గుండా ప్రయాణం నరకప్రాయం చేస్తున్నాననే ఆవేదన నన్ను దహించివేస్తుంది. పాలకుల్లారా నేను నా గుండా మీరు చిన్న పిల్లలుగా ఉన్నప్పటి నుంచి ప్రయాణం చేస్తున్నారు. ఇప్పుడు మీరు పెద్ద పెద్ద పదవులు అనుభవించారు. అనుభవిస్తున్నారు. నా దుస్థితికి శాశ్విత పరిష్కారం చూపి నన్ను బాగు చేయండి మీ ప్రయాణానికి, మీ తరాల సుఖ ప్రయాణానికి నాది భరోషా. నన్ను గోతుల మయం నుంచి తప్పించి ప్రయాణికులకు సుఖమైన ప్రయాణం కల్పించేలా నన్ను అభివృది చేస్తారని మనసారా కోరుకుంటున్నాను.

ఆదిత్యుని దర్శించుకున్న స్పీకర్ దంపతులు

విశాలాంధ్ర-అరసవల్లి: ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం వాణి దంపతులతోపాటు తనయుడు వైస్సార్సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా తమ్మినేని చిరంజీవి నాగ్ దంపతులు దేవాలయంనకు విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఘనంగా స్వాగతం పలికారు. తదుపరి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి శ్రీ స్వామి వారి జ్ఞాపికను ఆలయ ఇంచార్జ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరి సూర్య ప్రకాష్, ఆలయ అర్చకులు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మర్ల పోలమ్మవారి సంబర మహోత్సవం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని జగతి గ్రామంలో మర్ల పోలమ్మ అమ్మవారికి ఆది వారం జగతి గ్రామస్తులు సంబర మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ప్రతిరూప మైన గజ ముద్దలతో, కాళికా వేషధారణ, బాజా భజంత్రీల నడుమ గ్రామంలో తిరువీదులు చేపట్టి శివార్లలో ఉన్న మరల పోలమ్మమ అమ్మవారి ఆలయానికి భక్తులు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కలను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు చుట్టుప్రక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు
- పలుచోట్ల అన్నదానాలు కార్యక్రమాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆముదాలవలస పట్టణం, మండలం వ్యాప్తంగా ఘనంగా ఆంజనేయులకు పూజలు నిర్వహించారు. ఉదయం నుండి హనుమాన్ ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. మోనంగి వారి వీధిలో ఉన్న అయ్యప్ప దేవాలయంలోని హనుమాన్ ఆలయంలో ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. హనుమత్ జయంతి సందర్భంగా దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆదివారం ఆముదాలవలస పట్టణంలోని మోనింగి వారి వీధిలో అయ్యప్ప స్వామి ఆలయం లో రామాంజనేయ స్వామి ఆలయం లో జరిగిన పూజలు సందర్భంగా హనుమాన్ ఆప్టికల్స్ షాప్ యజమాని నూక లక్ష్మణరావు ఆర్థిక సహాయంతో 2వేల మందికి అన్న ప్రసాద వితరణ నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, జి రవి, ఏ.సురేష్,రాము, ప్రసాదు, మన్మధరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అభయాంజనేయ స్వామికి తమలపాకు అర్చనలు,సింధూరార్చనలు తో ఆలయ అర్చకులు జగన్ శర్మ పూజలు నిర్వహించారు. అలాగే వంజంగిలో ఆముదాలవలస జడ్పిటిసి సభ్యులు బెండి గోవింద రావు ఆధ్వర్యంలో హనుమత్ జయంతి సందర్భంగా పూజలు నిర్వహించి 2వేల మందికి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. లక్ష్ముదుపేట ,కొల్లివలస లలో ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. గాజుల కొలువలస గ్రామంలో పూజల నిర్వహించి అన్నదానం చేపట్టారు. అంజనీ పుత్రుడు విగ్రహాలను, ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మికత భావంతో భక్తులు వ్యవ హరించి పలువురకు ప్రసాదాలు పంచి పెట్టారు.

తల్లిని మించిన దైవం లేదు

రిమ్స్ ఆర్.ఎమ్.ఓ. ప్రసన్నకుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : అమృతం కంటే అమ్మ ప్రేమ గొప్పదని, తల్లిని మించిన దైవం లేదని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా నగరానికి చెందిన మానవతా స్వంచ్చంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రిమ్స్ ఆస్పత్రిలో ప్రసూతి వార్డులో గర్భిణీలకు, బాలింతలకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిమ్స్ ఆర్.ఎమ్.ఓ. డాక్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. అమ్మను ప్రతీ ఒక్కరూ మదిలో స్మరించికోవాలని, మన వ్యక్తిత్వ శిల్పి అమ్మ అని, ఆది గురువు కూడా అమ్మే నని అన్నారు. భారతీయ సమాజం సైతం మాతృదేవోభవో, పితృదేవోభవో అంటూ అమ్మకు అగ్రతాంబూలం ఇచ్చారని అన్నారు. అమ్మ స్థానం కు ఉన్న ప్రాధాన్యత ఇంకొకరికి లేదని మానవతా సేవా సంస్థ ఛైర్మన్ ఆచార్య దూడ విష్ణుమూర్తి అన్నారు. అమ్మకు వందనం అభివందనం అంటూ భారతీయ సంస్కృతిలో అమ్మకు ఉన్న పాత్ర వివరించారు. ప్రతీ ఒక్కరూ అమ్మ చేసిన త్యాగం గుర్తు చేసికొని మెలగాలని అన్నారు. అంతులేని ప్రేమానురాగాలకు, ఆప్యాయతకు మారుపేరు అమ్మ అని ఆయన అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రోగులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పనలో స్వంచ్చంద సంస్థలు అందించే సేవలు మరువలేమని డాక్టర్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మథర్ థెరిసా అవార్డ్ గ్రహీత జి.ఇందిరాప్రసాద్, మానవతా సంస్థ సభ్యులు రిటైర్డ్ డి.ఎస్.పి. కె.భార్గవ నాయుడు, జామి భీమసంకరరావు, ఎస్.జోగినాయుడు, సీనియర్ న్యాయవాది వై. మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకాకుళం నగరంలో ఏడురోడ్ల కూడలిలో మానవతా స్వంచ్చంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిక పంపిణీ ను శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి. వాసుదేవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్వంచ్చంద సేవకులు పాల్గొన్నారు.

పలాసలో రాజకీయ వలసలు ప్రారంభమయ్యేనా..?

విశాలాంధ్ర-పలాస: పలాస నియోజకవర్గంలో రాజకీయ వలసలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు మరో ఏడాది కాలం ఉండటంతో జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేని సందడి పలాస నియోజకవర్గంలో హెచ్చుగా కన్పిస్తుండటంతో జిల్లా ప్రజలకు పలాస కేంద్ర బిందువు అయింది. మాజీ ఎమ్మెల్యే శివాజీ కుమార్తె, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పలాస నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జీ గౌతు శిరీష వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో రెండోసారి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆమె అప్పుడప్పుడు నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారు. ఇప్పటికే మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లో పర్యటించి తన ఉనికిని చాటుకుంటున్నారు. అయితే శిరీషా టీడీపీ సీనియర్ నాయకులను పక్కన పెట్టి కొంతమంది చోటా నాయకులతో తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీల మధ్య నువ్వా... నేనా... అన్న చందంగా గౌతు కుటుంబం, మంత్రి డా.సీదిరి అప్పలరాజులు నియోజకవర్గ ప్రజలకు దగ్గర అవుతుండటంతో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. శిరీషా తండ్రి శివాజీ ఇటీవల చురుకుగా ప్రజా సమస్యలపై స్పందించడం కుమార్తెకు అండగా ఉండడం నియోజకవర్గంలో చర్చనీయాంశమవుతుంది. 6సార్లు ఎమ్మెల్యేగా తనకున్న అనుభవంతో వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా శిరీషా విజయానికి బాటలు వేయాలనే సంకల్పంతో ఆయన అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా వైసీపీ పరిస్థితి నల్లేరుపై నడకలా ఉన్నా అంతర్గతంగా అనేక సమస్యలతో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీ అభ్యర్థి శిరీషా అయితే తన గెలుపు సునాయసమని, భావిస్తున్న డాక్టర్ సీదిరికి పార్టీలో సీనియర్లు దూరమైన తలనొప్పి ఉంది. గత ఎన్నికల్లో డాక్టర్ సీదిరి విజయానికి కృషి చేసిన కొర్ల కన్నారావు, దువ్వాడ శ్రీకాంత్, వరిశ హరిప్రసాద్, దువ్వాడ హేంబాబుచౌదరి, జుత్తు నీలకంఠం, దున్న వీరాస్వామి, మద్దు రాంప్రసాద్‌లు పార్టీకి దూరంగా ఉంటూ డాక్టర్ సీదిరికి వ్యతిరేకంగా ఉన్నారు. వీరిని దూరం చేసేందుకు కొన్ని శక్తులు పని చేశాయని, వారే రాబోయే ఎన్నికలకు రథ సారథులుగా వ్యవహరించి డాక్టర్ సీదిరి అప్పలరాజు విజయానికి కారకులవుతామని భావిస్తున్నా వారిని నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని తెలుస్తోంది. అయితే మంత్రి డాక్టర్ సీదిరి తనదైన శైలిలో ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపడం గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు అభివృద్ధిపై దృష్టిసారించడంతో పాటు వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తన విజయానికి దోహదపడతాయని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో 2 లక్షల 38వేల ఓటర్లు ఉండగా వీటిలో 70శాతం పోలింగ్‌లో పాల్గొనే పరిస్థితులు దాపురిస్తాయి. నియోజకవర్గంలో గిరిజన, పల్లపు, సముద్ర తీర ప్రాంతం ఉద్దాన ప్రాంతంలో గల ఓటర్లు ఉండగా గతంలో కేవలం 17వేల ఓట్లుతో డాక్టర్ సీదిరి విజయం సాధించారు. అయితే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ఓటర్లు కీలకంగా మారే పరిస్థితులు ఉన్నాయి. మరి ఓటర్లు దేవుళు ఎవరిని దీవిస్తారో వేచిచూద్దాం.

పలాసలో వ్యూహాత్మకంగా వైసీపీ రాజకీయాలు:- పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. నియోజకవర్గంలో అత్యధిక సామాజిక వర్గమైన కాళింగులు పార్టీకి దూరం కాకుండా శ్రీకాకుళం పార్లమెంటు అభ్యర్థి గెలుపు చేజారకుండా అప్రమత్తమైంది. ఈ నేపధ్యంలోనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ముందుగానే టెక్కలి అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ (ప్రస్తుత ఎమ్మెల్సీ)ను మూలపేట పోర్టు భూమిపూజ సందర్భంగా జరిగిన సభలో ప్రకటించారు. పలాస నియోజకవర్గంలో దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ శ్రీధర్‌లకు కాళింగ సామాజిక వర్గంలో ఎక్కువుగా బంధుత్వాలున్నాయి. పలాస నియోజకవర్గంలో వైసీపీ అసమ్మతికి శ్రీనివాస్ సోదరుడు దువ్వాడ శ్రీకాంత్ నాయకత్వం వహిస్తూ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు నష్టం వాటిల్లకుండా వైసీపీ అధిష్టాన వర్గం ముందస్తుగా దువ్వాడ శ్రీనివాస్‌ను టెక్కలి అభ్యర్థిగా ప్రకటించారని ప్రచారం జరుగుతోంది. శ్రీనుకు టిక్కెట్ ప్రకటించడం వలన పలాసలో అసమ్మతిని కట్టడి చేయవచ్చనన్న అంచనా అధిష్టానం వేసినట్లు తెలుస్తోంది. అదే విధంగా టెక్కలి నియోజకవర్గంలో మత్స్యకార ఓట్లు అత్యధికంగా ఉండడంతో దువ్వాడ గెలువునకు వారి ఓట్లు రావాలంటే మంత్రి అప్పలరాజు అండదండలు దువ్వాడ శ్రీనుకు కావాలి. ఈ నేపధ్యంలో ఇటీవల దువ్వాడ శ్రీను పలాస వచ్చి మంత్రిని కలుసుకొని రెండు నియోజకవర్గాల్లో గెలుపునకు సహకారంపై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.



గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : నౌపడ, సంతబొమ్మాళి శాఖ గ్రంథాలయాలలో ప్రభుత్వము ఆదేశాల మేరకు, వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సంతబొమ్మాళి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కే కృష్ణారావు ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే నౌపడ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి బిరుపావతి ఆధ్వర్యంలో మాతృమూర్తి దినోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీకి మెటీరియల్ అందజేత

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మెళియాపుట్టి మండలంలోని చాపర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు లక్కోజు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు ఇటీవల పదవ తరగతిలో ఫెయిల్యూర్ అయిన విద్యార్థుల ఇంటికి వెళ్ళి వాళ్ళకు సప్లిమెంటరీకి సిద్ధమవ్వాలని భరోసానిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలో వారు మరొక్కమారు ఆ విద్యార్థులను కలుసుకొని సప్లిమెంటరీకు సన్నద్ధం చేయుటకు సంబంధిత సబ్జెక్టుకు సంబంధించిన మెటీరియల్ ను అందజేశారు. అంతేకాకుండా ఏ విధంగా చదవాలన్నది విద్యార్థులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు బుడ్డోడు మాస్టారు తదితరులు ఉన్నారు.

మీసాల రామకృష్ణ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-హిరమండలం : మండలవైస్సార్సీపీ అధ్యక్షులు, ఎంపీటీసీ ప్రతినిధి మీసాల రామకృష్ణ తండ్రి మీసాల రామారావు వంశధార విశ్రాంత ఉద్యోగి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసు కొని పాతపట్నం నియోజకవర్గశాసన సభ్యురాలు రెడ్డి శాంతి, ఆదివారం వారి కుటుంబ సభ్యులు ను కలిసి ప్రగాఢ సానుభూతి ని తెలియపరచి, మృతిని చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబం ను ఓదార్చి, ధైర్యాన్ని నింపారు. మృతుడు మీసాల రామారావు అనారోగ్యకారణాల తో మృతి చెందారు. నియోజకవర్గం లోని వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పరామర్శిస్తున్నారు. పార్టీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ ఎమ్మెల్యే పరామర్శించడం తో బోరున విలపించారు. తండ్రి ఆయన పట్ల ప్రవర్తించిన ప్రేమభిమానాలు చెప్పుకున్నారు. ఎమ్మెల్యే వెంట అందవరం సురేష్, జి, సురేష్, పి రమణ, తదితరులు ఉన్నారు.

వాడవాడల హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం చీపుర్లపాడు, తర్లిపేట, ఊడికలపాడు, లఖందిడ్డి, గంగరాం, కురుడు, దంత, హరిశ్చంద్రపురం, యలమంచిలి తదితర గ్రామాలలో గల హనుమాన్ ఆలయాలు, శ్రీరామమందిరాలలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఊడికలపాడు శ్రీరామమందిరంలో సనపల కరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చలమయ్యపేట శ్రీ అభయంజనేయస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త గేదేల వీరన్న స్వామి ఆధ్వర్యంలో భక్తులు వేకువ జామునుంచి హనుమాన్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు ఆలయంలో నిర్వహించిన భజన కాలక్షేపం భక్తులకు అకట్టుకుంది. అలాగే చీపుర్లపాడు శ్రీ అంజనేయస్వామి ఆలయం వద్ద వెలమల చిన్నారావు, గ్రామస్థులు ఆధ్వర్యంలో సుమారు మూడు వేలు మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇంటింటికి తాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యం

- వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ప్రతి ఇంటికి స్వచ్ఛమైనతాగునీరు అందించటమే ముఖ్యమంత్రి వైస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని, అందులో భాగంగా వైఎస్సార్ జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయి వేసి తాగునీరు అందిస్తున్నామని మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు బోయిన నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ కాళ్ళ సంజీవరావులు అన్నారు. ఆదివారం కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలోగల ప్రకాష్‌నగర్ కాలని వాసులకు ఇంటింటికి కొళాయి వేసి వైఎస్సార్ జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించి కాలనీ వాసులకు తాగునీటి అందించారు. గత ప్రభుత్వ హయాంలో మంచినీటి కోసం ప్రకాష్‌నగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు వడ్డారని, రెండుమూడు రోజులకోసారి ట్యాకర్లు ద్వారా తాగు నీరు అందించేవారని, ప్రస్తుతం ప్రతి రోజులు కొళాయిలు ద్వారా మంచినీరు అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు దాసరి అరుణమోహన్, కమ్మకట్టు అప్పలరాజురెడ్డి, దేవాది రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్రి చిరంజీవి, తాటిపర్తి రామారావు, ఆర్. ప్రశాంత్‌కుమార్, వాలంటీర్లు, అర్‌డబ్యూఎస్ రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుల ధృవీకరణ పత్రాలకు దళిత బాలికలు దూరం

విశాలాంధ్ర-మందస: దండాని వీధి లో నివాసముంటున్న ఎస్సీ కులానికి చెందిన విద్యార్థులు కె.భారతి, కె.రూపలకు కులధృవీకరణ పత్రాలు మంజూరు కాకుండా స్థానిక విఆర్‌వో అడ్డుకుంటున్నారని కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు మిస్క కృష్ణయ్య ప్రకటనలో తెలిపారు. 7, 8 తరగతులు చదువుతున్న ఈ ఇద్దరు కుమార్తెలు కోసం వితంతువు లైన తల్లి కె.సంతోషి సచివాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని, దళిత బాలిక విద్యాభివృద్ధికి ప్రోత్సహించకుండా ప్రభుత్వ విద్యకు దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన తెలిపారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సంఘీభావ యాత్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు సంఘీభావంగా సోమవారం కొత్తపేట తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయం నుంచి సంతబొమ్మాళి మండలం పాలేశ్వరిస్వామి ఆలయం వరకు జరగనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు చల్ల సింహాచలం పిలుపు నిచ్చారు. ఆయన ఆదివారం దంత గ్రామంలో విలేకర్లుతో మాట్లాడుతూ ఈ నెల 15వతేదీ సోమవారం నాటికి యువగళం పాత్ర చేపట్టి వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపు మేరకు యువగళం పాతయాత్రకు సంఘీభావంగా తెలుగుదేశం కార్యాలయం నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభ మై కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డు సంతబొమ్మాళి పాలేశ్వరిస్వామి ఆలయం వరకు జరుగుతుందన్నారు. ఈ పాదయాత్రలో టెక్కలి నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు, తెలుగుదేశంపార్టీ మహిళ నాయకుల, పార్టీ కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చిన్ననాటి జ్ఞాపకాలు మర్చిపోలేనివి

విశాలాంధ్ర-పలాస: చిన్ననాటి జ్ఞాపకాలు, చిన్నప్పుడు చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి, కేరింతలు ఒక్కసారి గుర్తు చేసుకుంటే మర్చిపోలేనివి అని 1996-97 బ్యాచ్‌కు విద్య నేర్పిన గురువులు కె.పాల్గుణరావు, తులసిరావులు అన్నారు. ఆదివారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరంలో చదువుకున్న కాశీబుగ్గ కీర్తన పంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 సంవత్సరాలు తరువాత మళ్లీ ఒకసారి కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మీరు మన కాశీబుగ్గ హైస్కూల్ వదిలి 25 సంవత్సరాలు అవుతుంది. ఇలాంటి అనుభూతి పూర్వ విద్యార్థులు కలయిక మళ్లీ రాదని, సిల్వర్ జూబిలిలో కలవడం మీరు ఇచ్చే గౌరవం, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారని అన్నారు. అనంతరం గణిత ఉపాధ్యాయులు పాల్గుణరావు, బయోలాజికల్ ఉపాధ్యాయులు తులసిరావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు మిమిక్రి, డాన్సులు చేశారు. కార్యక్రమంలో శీలం నవీన్‌కుమార్, వినోద్, నరేష్, హరిప్రసాద్, మోహన్, శ్రీధర్, పద్మ, సుధారాణి, శ్యామల, కుమారస్వామి, నాని, దీప, వైకుంఠరావు, మాధవరావులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సిలో మెరిసిన 'రత్నకుమార్'

విశాలాంధ్ర-ఆమదాలవలస : స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సిజిఎల్ పరీక్షలు శనివారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలలో పొన్నాడ రత్నకుమార్ ఎంపికయ్యారు. మండలంలోని వంజంగిపేట గ్రామానికి చెందిన పొన్నాడ రత్నకుమార్ ఎస్ఎస్‌సిలో ఎగ్జామినర్ పోస్ట్ కు ఎంపిక రావడంతో గ్రామస్తులలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం రత్నకుమార్ చిత్తూరు ఎస్బిఐ బ్యాంకులో క్యాషియర్ గా పనిచేస్తున్నారు. అతని తండ్రి అప్పారావు ఎల్ఐసి ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. తల్లి గృహిణి. ఇది ఎందుకు పట్ల గ్రామస్తుల అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-2001 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాల హెచ్ఎం బరాటం కామరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కే రామ్మోహన్రావు, ఎస్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో చదువుకున్న జ్ఞాపకాలు, పరిచయాలు నెమరు వేసుకున్నారు. వివిధ రకాల రంగాలలో పనిచేస్తున్నవారి వివరాలు, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మర్రిపాడు పంచాయతీ పెద్ద మర్రిపాడు పాఠశాలలో చదువుకున్న 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి గత జ్ఞాపకాలు, యోగక్షేమాలు, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారి విశేషాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరావు, ప్రభాకర్ రావు, శ్రీనివాసరావు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, పెదాడ విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం విద్యార్థి దశలో కీలకం

శాఖగ్రంథాలయధికారి అనురాధ

విశాలాంధ్ర-మెళియాపుట్టి: పుస్తకపఠనం విద్యార్థి దశలో కీలకమని మెళియాపుట్టి శాఖగ్రంథాలయధికారి అనురాధ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా శాఖ గ్రంథాలయానికి చేరుకుని రకరకాల దిన, వార, మాసపత్రికలను, రకరకాల కథల పుస్తకాలను చదివారు. ఈ సందర్భంగా శాఖగ్రంథాలయధికారి అనురాధ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తక పఠనంను అలవర్చుకోవాలని తద్వారా అపారమైన జ్ఞాన సంపదను పొందవచ్చున్నారు. అంతేకాకుండా దిన,మాస పత్రికలను చదవడం ద్వారా జరిగే అనేక విషయాలను తెలుసు కోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి పరిస్థితిలో ఆధ్యాత్మికతోనే ఆనందం

- భగవద్గీత సాధకులు యేరుకోలా ఆశామాతాజీ

విశాలాంధ్ర-పోలాకి: నిత్య జీవితంలో మనిషికి ఆధ్యాత్మికంతోనే ఆనందం ఉంటుందని భగవద్గీత సాధకులు యేరుకోలా ఆశామాతాజీ అన్నారు. ఆదివారం చింతాడపేటలో జరిగిన సత్సంగం కార్యక్రమం లో మాట్లాడారు. మనిషి క్రమశిక్షణకు ఎదుగుదలకు వ్యక్తి ఔనత్యంకు భగవద్గీత దిక్సూచిని అన్నారు. ప్రపంచ దేశాల మనుగడకు భగవద్గీత ఆదర్శమని ఉద్ఘటించారు. ఇప్పటి నుంచే పిల్లలకు ఆధ్యాత్మికం వైపు వయనించే ప్రయత్నం చేయాలనీ పెద్దలను కోరారు. ఇటువంటి పరిస్థితిలో ఆధ్యాత్మికం వైపు ఆలోచన అవసరమన్నారు. ప్రతి నెల నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటుపై నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బమ్మిడి విశ్వనాధం, సుసరాం ప్రాంతీయులు లక్ష్మణరావు, సూదుర ప్రాంతీయులు నుంచి విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందించిన అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని జగతి గ్రామాని కి చెందిన 10వ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గం పెద్దలు అభినందించారు. ఈ మేరకు ఆదివారం ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పొల్లాయి దీపిక సుప్రియ(514/600), పులకల శిరీష (455/600) లకు పులకల వీధిలో గల హనుమాన్ విగ్రహం వద్ద జగతి గ్రామ అగ్నికుల క్షత్రియ సామాజిక పెద్దలు శాలువా తో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సామాజిక పెద్దలు పి చిట్టిబాబు, సాగర్, పి కేశవరావు, పోల్లయి లోకనాథం, పోళ్ళయి లోకేష్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఉచిత మోడల్ లాసెట్ బాగుంది

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎం.పి.ఆర్.లా కళాశాలలో నిర్వహించిన ఉచిత మోడల్ లా సెట్ తమకు ఎంతో ఉపయోగకరమని పరీక్షకు హాజరైన అభ్యర్థులు అన్నారు. ఈ పరీక్షకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆగూరు ఉమామహేశ్వర రావు, చౌదరి లక్ష్మణ రావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యా రావు లు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్యార్థులకు అవగాహన కోసం ఈ మోడల్ లా సెట్ గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మోడల్ లా సెట్ నిర్వహణకు సహకరించిన లా కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్, కె.మోషేకు ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పట్టణంలో శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల సందర్భంగా పదిహేను రోజులుగా సాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. స్పాన్సర్ల సహకారంతో స్థానిక శ్రీ వెంకటేశ్వర డాన్స్ అకాడమీ, శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి జానపద నృత్య ప్రదర్శనలు, సత్య హరిశ్చంద్ర నాటిక, సినీ డూప్స్, ఢీ , జబర్దస్ షోల బృంధాల కామెడీ, పల్సర్ బైక్ ఫేం ఝాన్సీ, రమణల ప్రదర్శనలు, మ్యాజిక్, మ్యూజిక్ షోలు ఉల్లాసంగా సాగాయి. పెద్ద సంఖ్యలో వీక్షకులు ప్రతీ రోజు కార్యక్రమాలను తిలకించడానికి హాజరవ్వగా అందుకు అనుగుణంగా పోలీస్, ఉత్సవ కమిటీలు ప్రణాళికలు రచించుకున్నారు. పాస్‌ల జారీ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైయ్యాయి.

నేడు ఆలయ పున: ప్రవేశం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఇలవేల్పు శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారు దాదాపు నెల రోజుల పాటు గ్రామంలో పర్యటించి, భక్తులను ఆశీర్వదించారు. పదిహేడు రోజుల పాటు పట్టణంలో వివిధ వీధుల్లో అమ్మవారి దండు సమేతంగా ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాల నేపధ్యంలో దాదాపు 63 చోట్ల ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి వివిధ దేవతా విగ్రహాలను ఆయా ప్రాంత కమిటీల ఆధ్వర్యంలో భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేసారు. కోట్లాది రూపాయల అంచనా వ్యయంతో సంబరాలు ప్రారంభమవ్వగా, ప్రతీ ప్రాంతం విధ్యుత్ దీపాలంకరణలతో సందర్శకులను ఆకర్షించింది. అడుగడుగునా పోలీస్ డేగ కళ్ళు, వద ఘట్టనల నడుమ సంబరాలు సాగాయి. సంబరాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాలతో స్థానిక ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌చంద్రప్రసాద్, ఎస్సైలు కె.గోవిందరావు, రమేష్‌ల పర్యవేక్షణలో పోలీస్ బందోభస్తు ఏర్పాట్లు జరిగాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సూచనలతో యు.హెచ్.సితో పాటు అమ్మవారి ఉత్సవ మండపం పరిసర ప్రాంతాల్లో వైద్య బృంధాలు సేవలు అందించాయి. మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్ పర్యవేక్షణలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీర్‌రాజు, హెల్త్ అసిస్టెంట్ ఉపేంద్ర పొరిడా ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది అహర్నిశలూ శ్రమించారు. గ్రామ పర్యటన అనంతరం అమ్మవారు ఒక రోజు రథంవీధి కూడలి, మరొక రోజున దాసన్నపేటలలో నిలిచి భక్తులను దర్శనాన్ని కల్పించి ఆశీర్వదించారు. కాళికా, కోయ నృత్యాలు, గరిడీ ప్రదర్శనలు, ఇతర సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను అమ్మవారితో పాటు తిలకించిన ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేసారు. ప్రతీ రోజు ప్రతీ ప్రాంతం ఇతర ప్రాంతాల నుండి వచ్చే సందర్శకులతో రోడ్లన్నీ కిక్కిరిసాయి. బంధువులను ఆహ్వానించి స్థానికులు విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. అమ్మ చల్లని దీవెనలతో అంతా

సౌఖ్యంగా ఉండాలని భక్తులు ప్రార్థనలు జరుపుకున్నారు. జిల్లా ఎస్పీ దంపతులు, డి.ఎం. & హెచ్.ఓ, మాజీ రెవిన్యూ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్యేడ డాక్టర్ బెందాళం అశోక్ , అతని సతీమణి నీలోత్పల, పలు విభాగాల అధికారులు, రాజకీయ ప్రముఖులు అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ప్రత్యేక అతిధులను ఆలయ కమిటీ దుస్సాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేసింది. అత్యంత కోలాహలంగా సాగిన సంబరాలు నేటితో ముగియనున్నాయి. గ్రామ పర్యటన సాగించిన అమ్మవారు నేటి రాత్రికి తిరిగి ఆలయ పున: ప్రవేశం చేయనున్నారు.

ఘనంగా స్వామి వారి కల్యాణం

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం కార్లేమ్మ శ్రీవరహ నరసింహ స్వామివారి కళ్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోగుల వరప్రసాద్ రావు నాయుడు, మాధవి దంపతులు ఈ కల్యాణంలో పాల్గొన్నారు. శ్రీ వరహనరసింహ స్వామి ఆలయం రాష్ట్ర దేవాదాయ శాఖ అధీనంలో నడుస్తుంది ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.